# స్వానురాగమా? అనురాగమా?

" హాయ్ రజితా!"

"హాయ్ అభీ! త్వరగానే వచ్చేసావే!"

"ఏం త్వరగా? .... బయల్దేరి గంటదాటింది. సిటీ అంతా ట్రాఫిక్ జామ్స్... సప్తసముద్రాలు, కాకులు దూరని కారడవులు దాటొచ్చిన రాజకుమారుడిలా వందల బస్సుల్ని, వేల కార్లని, లక్షల టూవీలర్స్‌ని దాటి నిన్ను చేరుకోగల్గాను.... ఇంతకూ నువ్వేం చేస్తున్నావు?"

"నేనో నవల చదువుతున్నాను".

"ఏమిటో ఆ నవల?"

"డి. హెచ్. లారెన్స్‌ది.... "విమెన్ ఇన్ లవ్, ఎప్పట్నించో ఈ నవల చదవాలనుకుంటున్నాను. ఈ రోజు సెలవు కదా.... పుస్తకాల బీరువా సర్దుతోంటే ఎప్పుడో కొని పడేసిన ఈ నవల కనిపించింది. వెంటనే మొదలెట్టేశాను."

"ఆ నవలలోని విశేషమేమిటో?"

"నవల ప్రారంభమే నన్ను ఆకట్టుకున్నది"

"ఏమిటా ప్రారంభం?"

"ఇద్దరు అక్కచెల్లెళ్ళ సంభాషణతో నవల ప్రారంభమౌతుంది. నువ్వు నిజంగా పెళ్ళి చేసుకోవా? అని చెల్లెలు అక్కను అడుగుతుంది. అందుకు అక్క 'నాకు తెలీదు' అని సమాధానం చెబుతుంది. 'నువ్వా ప్రశ్నను యే దృష్టితో అడిగావో అన్నదాన్ని బట్టి కూడా నాసమాధానం ఉంటుంది' అని తర్వాత అంటుంది. "పెళ్ళి చేసుకుంటే నువ్వు ఇప్పటికంటె మంచి స్థితిలో ఉండవా?" అంటుంది చెల్లెలు. " చెప్పలేం" అంటుంది అక్క. "మనకు పెళ్ళి చేసుకోవడమనే అనుభవం అవసరం లేదంటావా?" అంటుంది చెల్లెలు. "పెళ్ళి చేసుకోవడమనేదొక అనుభవమా?" అని అడుగుతుంది అక్క. "అనుభవమే. వాంఛనీయమైన అనుభవం కాకపోవచ్చు. కానీ అది కూడా ఒక రకమైన అనుభవమే కదా!" అంటుంది చెల్లె. "కాదు. పెళ్ళితో "అనుభవం" అంతం కావడానికి ఎక్కువ ఆస్కారం ఉంటుంది" అంటుంది అక్క"

"ఇదంతా నాకెందుకు చెబుతున్నావు?"

"తెలీదు. నీకు చెప్పాలనిపించింది. చెప్పాను. అంతే!"

"అంతేనా?"

"మరో కారణం కూడా ఉంది. ఆ అక్క చెల్లెళ్ళ మాటలు నాకు పూర్తిగా అర్థం కాలేదు. నువ్వేమన్నా అర్థం చేయిస్తావేమోనని నీకు చెప్పాను"

"నాకూ అర్థం కాలేదు"

"నాకు అర్థమైనట్టే అనిపిస్తున్నది. కానీ యేం అర్థమైందో చెప్పమంటే చెప్పలేను. పెళ్ళి అనేది యేదో ఒక రకమైన అనుభవం కాదంటావా అని చెల్లెలంటే పెళ్ళితో అనుభవం అంతమౌతుందంటుంది అక్క. ఆమె అలా ఎందుకన్నదో నవల పూర్తిగా చదివితేగాని అర్థంకాదేమో...."

"అర్థంకాలేదని బాధపడటం దేనికి. అర్థంకానిదాన్ని గూర్చి బుర్ర బద్దలు చేసుకోవడం కంటె వదిలెయ్యడం మన ఆరోగ్యానికి మంచిది. దట్స్ మై పాలసీ"

"దట్స్ నాట్ మై పాలసీ. అర్థంకానిదాన్ని అర్థం చేసుకొని నా అనుభవంలోకి తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తాను"....

"ఎందుకంత యాతన పడటం.."

"లారెన్స్ అంటే నాకు చాలా ఇష్టం.ఆయన రాసిన ప్రతి మాటను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాను"

"లారెన్సో సెక్స్ రైటర్.... 'లేడీ చాటర్లీస్ లవర్' లాంటి బూతు నవలను రాసిన చెత్త రైటర్.... వాడు నీకు నచ్చడమేమిటి? రిడీక్యులస్!"

"వాడు నీకు నచ్చడమేమిటని మరీ వొత్తి పలుకుతున్నావు... యేమిటి నీ ఉద్దేశ్యం?"

"నువ్వో స్త్రీవి. యూనివర్శిటీలో లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తున్నదానివి. ఒక గౌరవనీయురాలుగా పేరున్న నీకు బూతు రాసే లారెన్స్‌లాంటి రైటర్ నచ్చడమేమిటి? అబ్సర్డ్!"

"స్త్రీలకు.... అందులో గౌరవనీయురాలనే ముద్ర ఉన్న స్త్రీలకు లారెన్స్ లాంటి ఇంగ్లీషు రచయితగానీ, చలంలాంటి తెలుగు రచయితలుగానీ ఇష్టం కాకూడదంటావు"

"అవును. మర్యాదస్తులైన స్త్రీలెవరూ సెక్స్‌ను గూర్చి మాట్లాడరు"

"మర్యాదస్తులైన పురుషులు మాత్రం గంటలగ్గంటలు సెక్స్‌ను గూర్చి మాట్లాడుకోవచ్చు. ఆడవాళ్ళను గూర్చి ఎన్నో డర్టీ జోక్స్ చెప్పుకోవచ్చు. వాళ్ళకు ఎంతోమంది పురుషపుంగవులతో సంబంధాల్ని అంటగట్టవచ్చు. అడ్డగోలు పుకార్లను ప్రచారం చెయ్యొచ్చు"

"ఓ..... కమాన్ రజితా! ఇలాంటి విషయాలను గూర్చి మనం ఇదివరకూడా చాలాసార్లు చర్చించుకున్నాం. ఉమన్ ఈజ్ ఎ ఉమెన్ ఈజ్ ఎ ఉమెన్.... మర్యాదస్తురాలైన స్త్రీ ఇలా ఉండాలని సమాజం ఆ స్త్రీకొక ఇమేజ్‌ను నిర్ణయించింది. ప్రతి స్త్రీ ఆ ఇమేజ్‌లో ఫిక్సయి పోవాలనే అనుకుంటుంది"

"సమాజం అంటే ఎవరు?"

"ఇది కూడా ఓ ప్రశ్నేనా? సమాజం అంటే నువ్వూ, నేనూ, మన చుట్టూ ఉన్నవాళ్ళు"

"కాదు.... సమాజం అంటే నేను కాదు – నువ్వే"

"అంటే?"

"అర్థం కాలేదా? సమాజమంటే పురుషులే"

"ఎందుకీ నిష్ప్రయోజనమైన చర్చ..... మనమీ సాయంత్రం దుర్గం చెరువు దగ్గరకెళ్ళి ప్రశాంతంగా గడుపుదామనుకున్నాం..... వెళ్దాం పద"

"నువ్వెళ్ళు..... నేను రావడం లేదు"

"ది సీజ్ టూమచ్! నేనొక్కడినే వెళ్ళేవాడినైతే తార్నాక నుండి ఈ అమీర్‌పేట దాకా అభేధ్యమైన పద్మవ్యూహంలాంటి ట్రాఫిక్ జామ్స్‌ని దాటుకొని నీ దగ్గరకెందుకొస్తాను. నీకోసమే నేనింత రిస్క్ తీసుకున్నాను"

"అయితే నువ్వు నాకోసమే మరో రిస్క్ కూడా తీసుకో"

"యేమిటది?"

"మళ్ళీ అమీర్‌పేట నుండి తార్నాక దాకా నీ కారు నడుపుకుంటూ వెళ్ళిపో"

"ఆర్యూ జోకింగ్?"

"నో.... అయామ్ నాట్ జోకింగ్... ఐమీనిట్"

"కమాన్ రజితా.... వాదనలు, జోకులు ఇకచాలు. కాస్సేపు అలా తిరిగొద్దాం పద.... దుర్గం చెరువు దగ్గర వాతావరణం చాలా బావుంటుంది. కాస్సేపక్కడ కూర్చొనివస్తే మనస్సుకు పట్టిన చిలుమంతా వదిలిపోతుంది"

"నేనీ నవల మధ్యలో ఉన్నాను. ఐ జస్ట్ కెనాట్ పుటిట్ డౌన్...."

"నవల చదువుకుంటున్న దానివి నన్నెందుకు ఇంత దూరం రప్పించావు?"

"నేను రప్పించలేదు. నువ్వే వస్తానన్నావు"

"నేను వస్తానని ఫోన్ చేసినపుడు రమ్మన్నావు కదా!"

"నువ్వు వస్తానని ఫోన్ చేసినప్పుడు నేనీ నవలను చదవడం మొదలెట్టలేదు."

"దిసీజ్ సిల్లీ.... దిసీజ్ అన్‌రీజనబుల్..... ఓ నవల చదవడం కోసం నీ కోసం సప్తసముద్రాల్లాంటి భయంకరమైన ట్రాఫిక్ జామ్స్‌ను దాటి రెండుగంటలు ప్రయాణం చేసి నిన్ను చేరుకున్న నీ డియరెస్ట్ ఫ్రెండ్‌ను వచ్చిన దారినే వెళ్ళిపోమ్మంటావా? ఇది అన్యాయం రజితా!"

"నీ దృష్టిలో అన్యాయంకావచ్చు. నాదృష్టిలో కాదు. ఒక గొప్ప నవలను చదువుతున్నప్పుడు కల్గే ఆనందం గురించి నీకేం తెలుసు? నువ్వెప్పుడూ నవలలు చదివిన పాపాన పోలేదు కదా!"

"ఓ షిట్! ఐడోంట్ కేర్ ఫర్ దీజ్ బ్లడీ నావెల్స్"

"బ్లడీ నావెల్స్! నువ్వా మాట అన్నందుకు నీమీద జాలిపడాలో .... లేక....."

"సారీ రజితా! నీకు నవలలంటే చాలా ఇష్టం కదా..... బ్లడీ నావెల్స్ అన్నందుకు సారీ.....అయామ్ రియల్లీసారీ...."

"సారీ చెప్పాల్సినంత పొరపాటు నువ్వేం చెయ్యలేదులే అభీ! నవలలంటే నీకేనాడూ ఇంటరెస్ట్‌లేదు కదా! యూ నెవర్ కేర్డ్ ఫర్ దెమ్"

"బట్ ఐకేర్ ఎ లాట్ ఫర్ యూ..... నాకు ఎవరికైనా సారీ చెప్పడం ఇష్టం ఉండదు. కానీ నీకు చెప్పాను. ఎందుకో చెప్పనా? నువ్వో ప్రత్యేకమైన వ్యక్తిత్వం ఉన్నదానివి. అందుకే నువ్వంటే నాకిష్టం..... చాలా ఇష్టం...."

"యూ ఆర్ జస్ట్ ఎ చైల్డ్.... ఒక్కొక్కసారి నువ్వు నాకో పసిపిల్లాడిలా కనిపిస్తావు అభీ!"

"ఓ.కే...... ఓ.కే.... నేనో చైల్డ్‌నే..... అయామ్ యువర్ చైల్డ్.... రైట్?"

"నో.... యూ ఆర్ నాట్ మై చైల్డ్.... యూ ఆర్ యువరోన్ చైల్డ్...."

"ఇక మాటలు చాలు..... చేతల్లోకొద్దాం. నువ్వు దుర్గం చెరువు దాకా రాకపోలే మానె. కనీసం ఇక్కడికి చాలా దగ్గర్లో ఉన్న గ్రీన్‌పార్క్ హోటల్‌దాకానన్నా వెళ్ళి కాస్సేపు కూర్చొనొద్దాం....."

"తర్వాత?"

"తర్వాత....... విడిపోదాం.."

"అంతేనా? విడిపోవడమేనా? మన హనీమూన్ ఇంత త్వరగా అయిపోతుందని నేననుకోలేదే?"

"జోక్ బావుంది. మన పెళ్ళే కాకుండా హనీమూన్‌ను గురించి మాట్లాడుతున్నావా? హోటల్లో కాస్సేపు కబుర్లు చెప్పుకున్నాక విడిపోదామన్నాను.....

నేనెన్నోసార్లు  మనం పెళ్ళి చేసుకుందామన్నాను. నువ్వే వద్దన్నావు..... ఆలోచించుకోవాలన్నావు. టైమ్ కావాలన్నావు..... ఐ లవ్‌యూ రజితా... ఐలవ్‌యూ..."

"రియల్లీ! నాలో యేంచూసి ప్రేమించావో తెలుసుకోవచ్చా?"

"నీ అందం.... నీ మంచితనం... నీ హుందాతనం. నీ సింప్లీసిటీ..... నీ నిర్మొహమాటత్వం.... నీ నిజాయితీ..."

"చాలు... చాలు... ఇవన్నీ నిజంగా నాలో ఉన్నాయా? లేక ఉన్నాయనుకొని భ్రమ పడ్తున్నావా?"

"భ్రమ పడటంలేదు... సంవత్సరకాలంగా నీతో స్నేహం చేస్తున్నాను..... ఇవన్నీ నీలో ఉన్నాయని రూఢి చేసుకున్నాను."

"రేపెప్పుడన్నా ఇవన్నీ నాలో లేవనుకునే స్థితి యేర్పండిందనుకో....అప్పుడేం చేస్తావు?"

"అలాంటి పరిస్థితి యేర్పడదుగాక యేర్పడదు"

"అంత కచ్చితంగా ఎలా చెప్పగలవు?"

"చెప్పగలను.... నాకు నమ్మకం కల్గింది. మరోసారి చెబుతున్నాను. ఐలవ్‌యూ రజితా! ఐలవ్‌యూ విత్ ఆల్‌మై హార్ట్ అండ్ సోల్"

"సినిమాల్లో హీరో, హీరోయిన్‌తో చెప్పినంత సులభంగా ఐలవ్‌యూ చేప్పేశావు. ప్రేమించడం అనేది ఇంత త్వరగా, ఇంత సులభంగా జరుగుతుందంటే నేను నమ్మలేకపోతున్నాను. అసలు ప్రేమించడమంటే యేమిటో కూడా నేను తేల్చుకోలేకపోతున్నాను."

"ఓ కమాన్ మై డియర్ రజితా! నువ్వు నా సహనాన్ని పరీక్షిస్తున్నావు. చూసుకున్న మొదటి క్షణంలోనే ప్రేమలో పడ్డవాళ్ళెందరో ఉన్నారని నీకు తెలియదా? నీకు ప్రేమించడం అంటే యేమిటో కూడా తెలియదా? అబ్సర్డ్...."

"అబ్సర్డ్..... నాకీ ప్రపంచమే ఒక పెద్ద అబ్సర్డిటీలా కనిపిస్తుంది. ఇదంతా అర్థం పర్థం లేని మాయలా కనిపిస్తుంది. ఫుల్ ఆఫ్ సౌండ్ అండ్ ఫ్యూరీ, సిగ్నిఫైయింగ్ నథింగ్‌లా..... ఓ ఫిలాసఫర్ అన్నట్టు మనిషనే వాడొక అర్థంలేని నిష్ప్రయోజనమైన ఆవేశం.... మ్యాన్ ఈజ్ ఎ యూజ్‌లెస్ పాషన్!"

"ఈ శుష్కవేదాంతం కట్టిపెట్టు రజితా! నువ్వు నన్ను ప్రేమిస్తున్నావో లేదో చెప్పు. నేనింక వెయిట్ చెయ్యలేను. అవునో, కాదో ఇప్పుడే ఈ క్షణమే చెప్పాలి"

"కొన్ని ప్రశ్నలకు వెంటనే అవుననో, కాదనో జవాబు చెప్పలేం అభీ!"

"వద్దు..... ఈడొంక తిరుగుళ్ళొద్దు. నువ్వు నన్ను ప్రేమిస్తున్నావా?... లేదా?... యస్ ఆర్ నో..."

" నిన్ను ప్రేమిస్తున్నానో లేదో చెప్పమంటే నా సమాధానం ఐడోంట్‌నో.... నాకు తెలీదు అనే.... ప్రేమంటే యేమిటో నా అనుభవంలోకి రానప్పుడు నిన్ను ప్రేమిస్తున్నానో లేదో ఎలా చెప్పగలను? నాకు నా అనుభవమే గీటురాయి"

"పోనీయ్, ప్రేమంటే యేమిటో నేను చెప్పనా?"

"చెప్పు..."

"ప్రేమంటే స్త్రీ పురుషులిద్దరూ ఒకరితో ఒకరు పూర్తిగా ఐక్యమైపోవడం. ఒకరికొకరు పూర్తిగా అర్పించుకోవడం. ఇద్దరుగా అంతమైపోయి ఒక్కరుగా రూపొందటం- అదొక అద్భుత అద్వైతస్థితి."

"బాగుంది. చాలా బాగుంది"

"యేమిటి బాగుంది."

"ప్రేమకు నువ్విచ్చిన నిర్వచనం"

"వెటకారమా?"

"కాదు"

"అయితె నీ కిప్పుడు ప్రేమంటే యేమిటో తెలిసింది కదా?"

"తెలియడం అంటే యేమిటి."

"నువ్వే చెప్పు"

"ఒకరు చెప్తోంటే వినగానే తెలిసిపోతుందా?"

"మరెలా తెలిసిపోతుంది?"

"వింటున్న విషయం మన అనుభవంలోకి రావాలి. మన మేధస్సులో, మన రక్తమాంసాల్లో జీర్ణమైపోవాలి. ఇద్దరుగా అంతరించిపోయి ఒకరుగా రూపొందటమే ప్రేమన్నావు. అది నిజంగా సాధ్యమా? ఆ స్థితిని అనుభవిస్తే తప్ప దాన్ని నేను నిజమని అంగీకరించలేను"

"నువ్వెరినైనా ప్రేమించినప్పుడే ఆ స్థితిని అనుభవించగలవు. నువ్వెవర్నీ ప్రేమించనంతకాలం నువ్వాస్థితికి చేరుకోలేవు."

"ఇద్దరం ఒకరుగా మారిపోవడం.... వినడానికి బాగానే ఉంది. కానీ అదెలా సాధ్యమౌతుందో నా ఊహకు అందటం లేదు...."

"ఇద్దరం ఒకరుగా మారడం అంటే?. భౌతికంగా కాదు.... నీ శరీరం నా శరీరం అంతరించిపోయి ఒక శరీరంగా అవతరించడంకాదు..... మానసికంగా ఒకరైపోవడం... నీ మనస్సు, నా మనస్సు... నీఆత్మ... నాఆత్మ యేకమైపోవడం....."

"మనస్సులు వేరు... ఆత్మలు వేరా? శరీరాలు అంతమైపోయినా ఆత్మలుంటాయంటారు. ఆ ఆత్మల గురించా నువ్వు చెబుతున్నది....."

"కాదు.. మనస్సన్నా, ఆత్మ అన్నా ఒకటే... మనస్సు యొక్క ఉన్నతదశనే ఆత్మ అంటున్నాను. నీ మనస్సు, నామనస్సు యేకమైపోవడం... నన్ను నేను నీకర్పించుకోవడం, నిన్ను నువ్వు నాకర్పించుకోవడం.... ఇద్దరంగా అంతరించిపోయి ఒక్కరంగా మారిపోవడం...."

"అది మాత్రం సాధ్యమా? ఇద్దరంగా అంతరించిపోయి ఒక్కరంగా ఎలా మారిపోతాం? నామనసు నీమనసు ఎలా ఏకమౌతాయి. నా మనస్సులో లక్షల ఆలోచనలు.... లక్షల సంవేదనలు... లక్షల స్పందనలు.... అదొక సంక్షుభిత, కల్లోల ప్రపంచం... నామనసు లోపలిపొరల్లో యేముందో నాకే తెలియదు. నీమనసు కూడా నామనసులాంటిదే... నీమనసు అంతరాంతరాల్లో యేముందో నీకూ తెలియదు. అలాంటప్పుడు నీమనసు నామనసు యేకమైపోయాయని ఎలా చెప్పడం? మరో విషయం.... నన్ను నేను నీకర్పించుకోవడం అంటే నా స్వేచ్ఛను, నా స్వాతంత్రియాన్ని పూర్తిగా కోల్పోవడం. నేనందుకు సిద్ధంగాలేను. అందుకే ప్రేమంటే యేమిటో నాకు తెలీదు అంటున్నాను. మనసులు ఏకం కావడం సాధ్యంకాదుగానీ శరీరాలు మాత్రం ఏకమౌతాయేమొ.... దాన్నే ఐడీయలైజ్ చేసుకొని ప్రేమనుకుంటున్నావేమొనని నా అనుమానం.... ఐడోంట్‌నో.... కవులు కీర్తించే ప్రేమ నా అనుభవంలోకి రానంతకాలం దాన్ని నేను తెలుసుకోలేను."

"నీతో నేను వాదించలేను రజితా.... నీలో అహం చాలా ఎక్కువుంది. అహాన్ని చంపుకోలేని నీలాంటి వాళ్ళెవరూ ఇంకొకర్ని ప్రేమించలేరు. తమనుతాము ఇంకొకరికి అర్పించుకోలేరు. నీలో అసలు ప్రేమించే హృదయం లేదు. నువ్వో యంత్రానివి. నువ్వో బండరాయివి. నువ్వొక జడ పదార్థానివి. ఐహేట్‌యూ.... ఐహేట్‌యూ... నీలాంటి వాళ్ళంటే నాకసహ్యం."

"నువ్వు ఐలవ్‌యూ చెప్పి ఐదు నిమిషాలైనా కాలేదు. అప్పుడే నీప్రేమ ద్వేషంగా మారిపోయిందా? ఇది నిజంగా సాధ్యమేనా? ప్రేమించినవాడు ద్వేషించలేడని నువ్వే ఒకసారన్నావు. ఒక్కసారి ప్రేమిస్తే ఆ ప్రేమ శాశ్వతంగా

నిలిచిపోతుందన్నావు.... నాకొక విషయం అర్థమవుతున్నది. ఈ ప్రేమ, ద్వేషం అనేవి ఒకే నాణానికుండే బొమ్మా, బొరుసులాంటివేమొ...."

"నువ్వే నా ప్రేమను ద్వేషంగా మార్చావు. ఓ సంవత్సరం నుండి నన్ను నీ చుట్టూ కుక్కలా తిప్పుకున్నావు. నీ అతితెలివి ప్రశ్నలతో నన్ను వేధించావు. విసిగించావు. ప్రేమంటే యేమిటో తెలీదన్నావు. అనుభవం ముఖ్యం అన్నావు. ప్రేమకంటే స్వేచ్ఛ ముఖ్యమన్నావు. కేవలం నీ అందాన్ని చూసే నేను నీ వెంట తిరుగుతున్నానన్నావు. ప్రేమంటే తెలీదని ఒకసారి..... ప్రేమంటే భౌతిక ఆకర్షణ మాత్రమే అని ఒకసారి...నీ అందాన్ని జుర్రుకోవడంకోసమే నేను నిన్ను ప్రేమిస్తున్నానంటున్నానని ఒకసారి...నాది నిజమైన ప్రేమ అని అంగీకరించలేకపోయావు. అందుకు నీలోని అహం కారణం. నాఅంత అందమైందీ ప్రపంచంలో లేదని నువ్వనుకుంటున్నావు. అహంకారంతో నీ కళ్ళు కప్పుకుపోయాయి. నీ జన్మలో నువ్వెవర్నీ ప్రేమించలేవు. ఐ హేట్ యూ.... ఐ హేట్ యూ విత్ ఆల్ మై హార్ట్ అండ్ సోల్"

"కానీ నిన్ను నేను ద్వేషించడం లేదు అభిలాష్! ఇంతకాలం నీమీద నాకున్నది స్నేహమా? లేక ప్రేమా? అని నన్ను నేను శోధించుకునే ప్రయత్నం చేస్తున్నాను. నా ప్రయత్నం ఒక కొలిక్కిరాక ముందే నువ్వు నన్ను ద్వేషిస్తున్నానని చెప్పేశావు. నువ్వు నన్ను నిజంగా ప్రేమించినవాడివే అయితే 'ఐ హేట్ యూ' అన్న మాట నీనోటినుండి వెలువడేది కాదు. నువ్వు నిజంగా నన్ను ప్రేమించలేదు. ప్రేమిస్తున్నానని నీకై నువ్వు సృష్టించుకున్న ఒక అందమైన భావాన్ని ప్రేమించావు. నా అందంతో ఆకర్షితుడవైన నువ్వు నన్ను నీ స్వంతం చేసుకోవాలన్న కోరికను ప్రేమించావు. అది ఒక రకంగా నిన్ను నువ్వు ప్రేమించుకోవడమే. నాకీ అనుభవం ద్వారా అర్థమైందేమిటంటే ఎవర్నీ ఎవరు నువ్వు ప్రేమను నిర్వచించిన అర్థంలో ప్రేమించలేరని. ప్రేమిస్తున్నామనే భావాన్ని ప్రేమిస్తారు. ప్రేమించబడాలన్న గాఢమైన కోరికను ప్రేమిస్తారు. మనం ఇష్టపడే గుణాల్ని మనం ప్రేమిస్తున్నామనుకునే వాళ్ళళ్ళో ఉన్నాయనుకొని ప్రేమిస్తాం. అయితే నువ్వన్న ఆ ఉదాత్తమైన ప్రేమ ఉండడం సాధ్యంకాదని నేనడం లేదు. అంత ఉదాత్తమైన స్థాయిని అందుకునే వాళ్ళు ఎందరుంటారన్నదే నా సందేహం. అలాంటి ప్రేమ నా అనుభవంలోకొచ్చినప్పుడు అలాంటి ప్రేమ సాధ్యమేనని నేనంగీకరిస్తాను."

"నీలోని అహాన్ని అంతం చేసుకొని ఎవరికో ఒకరికి నిన్ను నువ్వు అర్పించుకునేంత వరకు నువ్వా ఉదాత్తమైన ప్రేమను అనుభవించలేవు. నీళ్ళళ్ళోకి

దిగేంతవరకు ఈదడం రాదు. నీలాంటి అహంకారులు ఈత వస్తేనే తప్ప నేను నీళ్ళల్లోకి దిగనని భీష్మించుకొని కూర్చుంటారు. ఈ రోజు నిన్ను ఒక మంచి ప్రశాంతమైన ప్రదేశానికి తీసికెళ్ళి నీతో తాడోపేడో తేల్చుకోవాలన్న నిర్ణయంతోటే నీ దగ్గరకొచ్చాను. చివరిసారి అడుగుతున్నాను. నువ్వు నన్ను ప్రేమిస్తున్నావా? లేదా? మనం పెళ్ళి చేసుకుందామా? లేక ఇలాగే సంవత్సరాల కొద్దీ ప్రేమంటే యేమిటని వాదించుకుంటూ కాలం గడిపేద్దామా?అవునో కాదో చెప్పెసెయ్"

"నీతో ఈ సంవత్సరకాలం స్నేహం చెయ్యడం ఒక అనుభవం. ఆ అనుభవం ఈ రోజుతో అంతమైపోయింది. మైడియర్ అభీ! నా అందాన్ని జుర్రుకోవాలన్న ఆతురత తప్ప నామీద నీకు నిజమైన ఆ ప్రేమ.... నువ్వే నిర్వచించిన ఇద్దరంగా అంతరించి ఒక్కరుగా మారిపోవడం లాంటి ఐడీయలిస్టిక్ ప్రేమ నీ మైండ్‌లో తప్ప నీ హృదయంలో లేదు. ఉందని నిన్ను నువ్వు నమ్మించుకుంటూ నన్ను నమ్మించే ప్రయత్నం చేస్తున్నావు.... ఈ నాటకానికిక తెరవేద్దాం. నీకు డబ్బు, హోదా, పెద్ద ఉద్యోగం.... అన్నీ ఉన్నాయి. ఎందరో నాకంటే అందమైన అమ్మాయిలు నీకోసం ఎదురుచూస్తుంటారు. ఈ ప్రేమా, గీమా అనే భావనని నీ మైండ్‌లోంచి తీసేసి వాళ్ళల్లో ఎవర్ని చేసుకున్నా నువ్వు హాయిగా ఉండగలవు. నాలాంటి సందేహాల పుట్టను చేసుకుంటే చాలా కష్టాలు పడ్తావు. నేను నేనేమిటో, ఈ ప్రపంచమేమిటో, ఈ సమాజమేమిటో ప్రేమ,ద్వేషం అనే ఈ వైరుధ్యాలేమిటో అర్థం చేసుకునే ప్రయత్నంలో ఉన్నాను. నన్ను వేధించే చాలా ప్రశ్నలకు నాకింకా సమాధానాలు లభించలేదు. నాఅనుభవంలోకి రానిదాన్ని కేవలం పుస్తకాల్లో చదివి వాస్తవంగా అంగీకరించలేను. ప్రేమ అనేది కేవలం శరీరాల కలయికా? నువ్వంటున్న ఆత్మల లేక మనస్సుల కలయికా? లేక ఈ రెండూనా? అన్నది నాకింకా స్పష్టంకాలేదు. అప్పటిదాకా నేనెవర్నీ ప్రేమించలేను. అలాగే పెళ్ళి అనే చట్రంలో నన్ను నేను బంధించుకోదల్చుకోలేదు. నాకన్నింటికంటే స్వేచ్ఛ ముఖ్యం. సెక్స్, ప్రేమ, స్వేచ్ఛ పెళ్ళి..... వీటినెలా సమన్వయం చేసుకోవాలో నేనింకా తేల్చుకోలేదు. ఈ గొడవంతా నీకర్థంకాదు. అర్థం చేసుకునే ఓపికగానీ, లోతుగానీ నీకు లేవు. నా బాహ్యరూపాన్ని చూసి నన్ను ప్రేమించాననుకుంటున్నావు. ఆకర్షణకూ, ప్రేమకూ మధ్య ఉండే వ్యత్యాసాన్ని గుర్తించలేకపోతున్నావు. రజిత అనే ఓ అందమైన అమ్మాయిని నేను ప్రేమిస్తున్నాననే భావనని ప్రేమిస్తున్నావు. అంటే నీలోనే ఉన్న ఒక పార్శ్వాన్ని నువ్వు ప్రేమించుకుంటున్నావు తప్ప అది నామీది ప్రేమ కాదు. నామీది ప్రేమ

అని అనుకుంటున్నావు. అలా అనుకోవడంలో కొంత తృప్తి ఉంటుంది. నువ్వే కాదు. ఎవర్నో ప్రేమిస్తున్నామనుకునే చాలామంది విషయంలో కూడా ఇదే నిజం. తమనే ప్రేమించుకుంటూ ఎవర్నో ప్రేమిస్తున్నామనుకుంటారు. నీ విషయంలోనే కాదు. ప్రేమిస్తుస్తున్నామనుకునే చాలా మంది విషయంలో కూడా ఇదే నిజం. దీన్ని స్వానురాగం... ఇంగ్లీసులో 'నార్సిసిజమ్' అంటారు.... దీనికతీతమైన ప్రేమ ఉంటుందా? అనేది నేను తెల్చుకోవాలి."

" నువ్వో గొప్ప మేధావిననుకొని ఇదంతా నాకు చెబుతున్నావు. నేను నిజంగా నిన్ను ప్రేమించాను. నువ్వు కూడా నన్ను ప్రేమించావు. కాని నీలో వున్న అహం నీ హృదయంలోని ప్రేమకు అడ్డుకట్ట వేస్తున్నది. నీలో హృదయస్పందన కంటే మేధోస్పందన అధికమైపోయింది. నువ్వు నీ హృదయంతో మాట్లాడటం లేదు. మేధస్సుతో మాట్లాడుతున్నావు. నన్ను ప్రేమించటడంలేదని నిన్ను నువ్వు మోసగించుకుంటూ ఆత్మవంచనకు పాల్పడుతున్నావు. నీలోని హృదయానికి, మేధస్సుకు మధ్య గొప్ప సంఘర్షణ జరుగుతున్నది. ఆ సంఘర్షనలో ప్రస్తుతం నీలోని మేధ విజయాన్ని సాధిస్తున్నది. సమీప భవిష్యత్తులో నీలోని మేధను నీ హృదయం జయించగల్గితే అప్పుడు నేను నీకు గుర్తొస్తాను. సో గుడ్ బై మైడియర్ రజిత ......గుడ్ బై .....".

– 'ఆంధ్రజ్యోతి' ఆదివారం, *23-09-2007*

కథా నిలయం
శ్రీకాకుళం